క్లుప్తంగా

సమగ్ర వేతన చట్టం చేయాలి

ఖమ్మంరూరల్: వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని లక్షలాది మంది కార్మికులు కనీస వేతనం లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని, కార్మికులకు పక్కా ఇళ్లతో పాటు రేషన్ కార్డులు మంజూరు చేయాలని తెలిపారు.

వైభవంగా తెప్పోత్సవం

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శనివారం తెప్పోత్సవం వైభవంగా జరిగింది. శివాలయం నుంచి శివుడిని గ్రామంలో ఊరేగించాక సాగర్ కెనాల్‌లో తెప్పోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తిలకించాక దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా ఇరుముడి

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాదారం గ్రామంలో శనివారం అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. 41 రోజులు ప్రత్యేక పూజలు చేసిన 81మంది మాలధారులు ఇరుముడితో అయ్యప్ప స్వామి దర్శనం కోసం బయలుదేరారు. కాగా, గురుస్వాములు కళ్లెం రామిరెడ్డి, సుంకర శ్రీనులు వారికి ఇరుముడి కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆట,పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో గాదె అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కవులకు సన్మానం



కవులను సన్మానిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించి, కవులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ కార్యదర్శి అర్జున్, ఉద్యోగులు కవులకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కవులు నాగభూషణం, ఆంజనేయులు, గ్రంథాలయ ఉద్యోగులు కేవీఎస్ఎల్ఎన్ రాజు, ఎండీ ఇమామ్, కనకవల్లి, భాస్కర్, అఖిల్, రవిబాబు, బాబు, లలితకుమారి, విజయ్‌కుమారి, రోజా తదితరులు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌నకు ఎంపిక



ఇందుప్రియ

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థిని ఇందుప్రియ మహారాష్ట్రలో జరగనున్న వెస్ట్‌జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌నకు ఎంపికైంది. ఈనెల 12న మొదలైన క్యాంపు 21వ తేదీ వరకు కొనసాగుతుందని ప్రిన్సిపాల్ జి.పద్మావతి తెలిపారు. క్యాంప్‌లో తెలంగాణ బృందం తరఫున పాల్గొంటున్న ఇందుప్రియను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కంగువ(3డీ)
వినోద	లక్కీ భాస్కర్
సాయిరాం	మట్కా.అప్పుడో ఇప్పుడో ఎప్పుడో
ఆదిత్య	రాధేకృష్ణ
శ్రీనివాస	అమరన్
సినీ గెలాక్సీ	క(2024)

\- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	38	బచ్చలికూర	3
వంకాయ	38		20
బెండకాయ	24	పాలకూర	3
పచ్చిమిర్చి	38		20
కాకర	28	చుక్కకూర	3
బోడ కాకర	100		20
బీర	38	తోటకూర	3
దొండ	30		20
పొట్లకాయ	40	గోంగూర	5
చిక్కుడు	74		20
గోరుచిక్కుడు	48	మెంతికూర	2
క్యాబేజీ	34		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	38		40
చామగడ్డ	44	పుదీన	1
క్యారెట్	74		25
క్యాప్సికం	68	-ఖమ్మం వ్యవసాయం	

చీకటి వెలుగులు..!



కార్యాలయాలకు సమీపాన ప్రమాదకరంగా ఉన్న జింకలతండా క్రాస్‌రోడ్ జంక్షన్



మొక్కలు, లైట్లు లేని డివైడర్లు

అసంపూర్తిగా ఖమ్మం- ఇల్లెందు రోడ్డు విస్తరణ పనులు

- పేరుకే డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు
- వెలుగులు లేక.. మొక్కలు నాటక..
- ఏడాది కాలంగా ఎదురుచూపులు
- పట్టించుకోని అధికారులు

రఘునాథపాలెం: కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నిర్మాణం చేపట్టిన డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తయి ఏడాది కావొస్తున్నా వెలుగులకు నోచుకోవడం లేదు. డివైడర్లు నిర్మించి.. మట్టి నింపినా మొక్కలు నాటకుండానే వదిలేశారు. రఘునాథపాలెం మండల కార్యాలయాల కాంప్లెక్స్ ఎదురుగా ఖమ్మం- ఇల్లెందు ప్రధాన రోడ్డు నాలుగు లైన్ల విస్తరణ పనులు పూర్తయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన పనులు నిలిచిపోయాయి.

రూ.30 కోట్లతో పనులు..

మండల కేంద్రమైన రఘునాథపాలెంలో ఖమ్మం -ఇల్లెందు ప్రధాన రోడ్డులోని కోయచలక క్రాస్ రోడ్డు వద్ద నుంచి సుడా పార్కు వరకు సుమారు రూ.30 కోట్ల అంచనాలతో గతేడాది నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు మొదలు పెట్టారు. ఆతర్వాత విద్యుత్ వెలుగుల కోసం సెంట్రల్ లైటింగ్, పచ్చదనం కోసం డివైడర్లు నిర్మించారు. అయితే సెంట్రల్ లైటింగ్ కోసం స్తంభాలు వేసి, మొక్కలు నాటడం కోసం డివైడర్లలో మట్టిని నింపారు కానీ ఉపయోగం లేదు. అంతేకా ఇంతవరకు వెలుగులు కూడా లేవు. రోడ్డు పనులు పూర్తవడంతో వాహనాల రద్దీ పెరిగింది. కాగా, జింకలతండా క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన జంక్షన్ వద్ద రాత్రి పూట వెలుగులు లేకపోవడంతో వాహనాలు అతి వేగంగా రాకపోకలు సాగించే సమయాన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

చీకటి పడితే నిర్మానుష్యంగా..

ఒక వైపు ఎంపీడీఓ, తహసీల్దార్, పోలీస్ స్టేషన్, మరో వైపు రైతువేదిక, విత్తన గిడ్డంగి, సరుకుల నిల్వల గోదాంలు ఉన్నాయి. అక్కడకు వచ్చే వాహనాలు, ప్రజలు, అధికారులతో నిత్యం ఆ ప్రాంతం రద్దీగా ఉంటుంది. కానీ సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో చీకటి పడితే అడవిని తలపించేలా నిర్మానుష్యంగా మారుతున్నాయి. దీంతో రాకపోకలు సమయాన పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి నిత్యం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేపోయే వారికి కొత్తదనం నింపేలా సెంట్రల్ లైటింగ్‌తో పాటు డివైడర్లలో మొక్కలు నాటి ఆహ్లాదాన్ని కలిగించాలని పలువురు కోరుతున్నారు. కాగా, పనులు పూర్తయి ఏడాది అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి.

అసంపూర్తిగా పనులు..



రఘునాథపాలెంలోని ప్రభుత్వ కార్యాలయాల ఎదురుగా రోడ్డు విస్తరణ పనులు ఎంతో ఉపయోగకరం. కానీ పనులు అసంపూర్తిగా చేసి వదిలేశారు. రూ.కోట్లు ఖర్చు చేసినా ఫలితం లేకుండాపోయింది. తక్షణమే లైట్లు వెలిగించి, డివైడర్ల మధ్యలో మొక్కలు నాటించాలి. జంక్షన్‌లో తగు చర్యలు తీసుకోవాలి.

\- తోటా వెంకట్, కోయచలక

అధికారులు దృష్టి సారించాలి..



రూ.కోట్లు ఖర్చు చేసి నాలుగు లైన్ల రోడ్డు వేసి మధ్యలో లైట్లు, మొక్కలు కోసం డివైడర్లు నిర్మించి వదిలేశారు. ఖాళీగా స్తంభాలు ఉంచే కంటే వెలుగులు అందిస్తే రవాణాపరంగా ఉపయోగంగా ఉంటుంది. మొక్కలు నాటితే ఆహ్లాదకరంగా ఉంటుంది. అధికారులు వాటిపై దృష్టి సారించాలి..

\- జలాది కిషోర్, రఘునాథపాలెం

ప్రణాళికతో 'ఉపాధి' పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న సన్యాసయ్య

రఘునాథపాలెం: గ్రామాల్లో 2024-25 ఏడాదిలో చేపట్టబోతున్న ఉపాధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని డీఆర్డీఓ సన్యాసయ్య పేర్కొన్నారు. శనివారం రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి మండలంలో చేపట్టే పనులపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలల్లో మరుగుదొడ్లు, చెక్ డ్యామ్‌లు, నర్సరీలలో మొక్కల పెంపకం, చేలకు వెళ్లే డొంక రోడ్ల అభివృద్ధి తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం డీఆర్డీఓ మాట్లాడుతూ.. వివిధ శాఖల ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రాధాన్యత పనులను గుర్తించి ఉపాధి హామీ పథకంలో చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్ కుమార్, ఏపీఓ పద్మయ్యనాయుడు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వనసమారాధనకు ఆహ్వానం



నాగేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

ఖమ్మంసహకారనగర్: వచ్చేనెల 1న ఎస్ఆర్‌వి పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగే ఆత్మీయ సమ్మేళనం, వనసమారాధనకు హాజరుకావాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావును నిర్వాహకులు ఆహ్వానించారు. ఆయనను శనివారం ఎస్ఆర్‌వి పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కానూరి హిమబిందు ఆధ్వర్యాన కలిసి సన్మానించారు. అలాగే, వన సమారాధనకు హాజరుకావాలని కోరారు. అసోసియేషన్ బాధ్యులు వెనిగళ్ల శ్రీనివాసరావు, సామినేని నాగేశ్వరరావు, పెద్దినేని రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వయం పాలన దినోత్సవం

రఘునాథపాలెం: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రఘునాథపాలెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శనివారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా కె.సాయిచరణ్ బాధ్యతలు నిర్వర్తించగా.. పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు హెచ్ఎం ఎం.వెంకటేశ్వర్లు బహుమతులు అందచగా.. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ప్రియదర్శిని'లో ఫ్రెషర్స్‌డే

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రియదర్శిని డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని విద్యాసంస్థల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. అనంతరం సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ వి.రామారావు, ఎం.వెంకటేశ్వరరావు, అకాడమిక్ డైరెక్టర్ ఎం.శివకుమార్, ఫిజికల్ డైరెక్టర్ జి.విల్సన్ పాల్గొన్నారు.

'శ్రీచైతన్య'లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్

ఖమ్మంసహకారనగర్: నగరంలోని శ్రీచైతన్య స్కూల్ మామిళ్లగూడెం బ్రాంచ్‌లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా శనివారం సేఫ్ ఇండియా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రాఫిక్ ఎస్సై సాగర్ పాల్గొని ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈక్రమంలో విద్యార్థులకు తలెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. అలాగే ర్యాలీ ద్వారా ప్రజలకు హెల్మెట్, సీట్ బెల్ట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి పిల్లలతో పుష్పగుచ్ఛాలు అందించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం చేతన్ మధుర్, కోఆర్డినేటర్ కృష్ణారావు, ప్రిన్సిపాల్ నీరజ, డీన్ సైదుబాబు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం

ఖమ్మం మామిళ్లగూడెం: వచ్చే నెల 1న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి మాలలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం కోరారు. శనివారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం మాలమాల ఉపకులాల ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ రిటైర్ కాంట్రాక్టింగ్ లాయర్స్, డాక్టర్స్ బైక్ ర్యాలీలో పాల్గొని మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి ఆత్మీయ సమ్మేళన్ని విజయవంతం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సలహాదారుడు లింగాల రవికుమార్, బాబూరావు, జాకోబ్ ప్రతాప్, సత్యం, దయానంద్, సుధాకర్, కనకరాజు, చిరంజీవి, నాగేశ్వరరావు, మల్లయ్య, రవి, రమేష్, వెంకటేశ్వర్లు, ఏలియా, తదితరులు పాల్గొన్నారు.

పోతులూరి ఆరాధన ఉత్సవాల్లో అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బాలగంగాధర్‌తిలక్ తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గాంధీచౌక్‌లో నిర్వహిస్తున్న శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 52వ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు, ఖమ్మం త్రీటౌన్ ఏరియా కో-ఆర్డినేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొంకిమళ్ల శ్రీనివాసరావు, గడ్డం వేణు, విజయనగరి శ్రీనివాసరావు, సదానందాచారి, జానపాముల చలపతిరావు, వంగ లక్ష్మణ్, బూర్లె లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరరావు, గొరోజు వసంతబాబు, కొమ్మోజు శ్రీనివాసరావు, కుప్పిలి వెంకటాచారి అవినాష్, సంతోష్, నాగకృష్ణ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖాధికారుల 'పొలంబాట'



మాట్లాడుతున్న డీఈఈ నాగేశ్వరరావు

నేలకొండపల్లి: మండలంలోని ఆరెగూడెంలో శనివారం విద్యుత్ శాఖాధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ డీఈఈ చింతమళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈకార్యక్రమం ద్వారా రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు మోటార్ల వద్ద కెపాసిటర్లు వాడాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని వెంటనే పరిష్కరించారు. అందులో వంగిన స్తంభాలు, కిందకు వేలాడుతున్న తీగలను సరిచేయడం, విరిగిన లేదా ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను మార్చడం వంటి సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కోక్యా నాయక్, రాజేశ్వరపురం ఏఈ డి.నారాయణరావు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను తొలగించండి

ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మం 30వ డివిజన్ సుందరయ్యనగర్‌లో డ్రెయినేజీ మధ్యలో విద్యుత్ స్తంభాల తీగలు ఇళ్లపై నుంచి వెళ్తుండడంతో ప్రమాదకరంగా మారాయని, వాటిని వెంటనే తొలగించాలని సీపీఐ జిల్లా నాయకుడు మహ్మద్ సలాం కోరారు. శనివారం సీపీఐ ప్రతినిధి బృందం ఆధ్వర్యాన డివిజన్‌లో పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈవిషయాన్ని చాలా ఏళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించకపోతే స్థానిక ప్రజలతో కలిసి మున్సిపల్ కార్పొరేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నూనె శశిధర్, నగర కార్యవర్గ సభ్యులు భూక్యా రవీందర్, రాము, రమేష్, రామకృష్ణ, పోతురాజు కృష్ణ, సాయి, జనార్దన్, యేసురత్నం, వెంకటమ్మ, పద్మ, లక్ష్మి, మున్నా, తదితరులు పాల్గొన్నారు.

పరస్పర సహకారంతో సమాజాభివృద్ధి



డీసీఓ గంగాధర్‌ను సత్కరిస్తున్న చైర్మన్ కృష్ణమూర్తి

ఖమ్మంవ్యవసాయం: పరస్పర సహకారంతో సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా సహకార అధికారి జి.గంగాధర్ తెలిపారు. ఖమ్మం గాంధీ చౌక్‌లోని భద్రాద్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి అధ్యక్షతన శనివారం సహకార వారోత్సవాల సమావేశం నిర్వహించగా ఆయన సహకార పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో డీసీఓ మాట్లాడుతూ.. సహకార రంగం సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు వెన్నుదన్నుగా నిలుస్తోందని తెలిపారు. చైర్మన్ కృష్ణమూర్తి మాట్లాడుతూ తొలుత సహకార సంఘంగా ఏర్పడగా, ఆతర్వాత రిజర్వ్ బ్యాంకు అనుమతితో భద్రాద్రి బ్యాంకుగా రూపుదిద్దుకుందని తెలిపారు. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉషశ్రీ, టీచింగ్ ఫ్యాకల్టీ రాజయ్య, బ్యాంకు ఏఓ దాసరి వేణుగోపాల్ రావు, డీజీఎం ప్రసాద్, మేనేజర్లు శ్యాంసుందర్ రావు, కిషోర్, మూర్తి, ఎం.వీ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ హింసను ప్రేరేపిస్తోంది..'



మాట్లాడుతున్న పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ఖమ్మంవన్‌టౌన్: అధికారం పోయి ఏంచేయాలో తెలియక బీఆర్ఎస్ హింసా మార్గాన్ని ఎంచుకుని ప్రభుత్వంపై, అధికారులపై దాడులకు ఉసిగొల్పుతుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అసహనం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు శాంతియుతంగా ధర్నాలు, నిరసనలు చేశామే తప్ప ఏనాడూ దాడులకు పాల్పడలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గాంధేయవాద ప్రభుత్వమని, అహింసా మార్గంతోటే దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పెట్టిన చరిత్రగల పార్టీ అన్నారు. అనంతరం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావులు మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎన్నడూలేని విధంగా కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి సీసీఐ ద్వారా ప్రభుత్వమే మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ప్రతిపక్ష నాయకులు కావాలనే తప్పుదోవ పట్టిస్తూ ప్రభుత్వాన్ని అస్థిర పరిచే కుట్ర చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా చేస్తూ వస్తుందన్నారు. ఈ సమావేశంలో ఓబీసీ సెల్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొడ్డు బొందయ్య, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొక్కా శేఖర్‌గౌడ్, సయ్యద్ గౌస్, గుడిపూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నేలకొండపల్లి: దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీచైర్మన్ వెన్నపూసల సీతారాములు సూచించారు. శనివారం మండలంలోని అనాసాగారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల అభ్యర్థన మేరకు ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో నిబంధనలు పాటించి క్వింటాకు రూ.2,300 మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం అశోక్‌రాణి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆలస్యం మధుసూదన్‌రావు, సీసీ మంగమ్మ, స్వయం కృషి సమాఖ్య ప్రతినిధులు బందెల రూప, సుజాత, అరుణ, ప్రమీలా తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

తిరుమలాయపాలెం: పత్తి, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బంది లేకుండా వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని రైతు సంఘం మండల నాయకుడు తుల్లూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం తిరుమలాయపాలెంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. పత్తి పంట దిగుబడులు తగ్గి పెట్టుబడులు రాక ఇబ్బందులు పడుతున్న రైతులను సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం పేరుతో తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని, దీంతో వారు దళారులకు విక్రయిస్తున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో కూడా తేమశాతం నిబంధనలతో ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యం విక్రయిస్తున్నారని, ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ దక్కని పరిస్థితి ఏర్పడిందని, రైతు రుణమాఫీని పూర్తిగా అమలు చేయాలని, సబ్సిడీపై విత్తనాలు, యంత్రాలు అందించాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వం



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కామేపల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ప్రజా సమస్యలపై దృష్టి సారించడం లేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దుగ్గి కృష్ణ అన్నారు. ముచ్చర్ల-మద్దులపల్లి మధ్య బీటీ రహదారి పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. శనివారం ఈమేరకు పార్టీ ఆధ్వర్యాన నిమ్మవాగు సమీపంలో రాస్తారోకో నిర్వహించి తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని, లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యాన ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అంబటి శ్రీనివాస్‌రెడ్డి, బాదావత్ శ్రీను, గుండా వెంకటరెడ్డి, అడపా ఉపేందర్, వరికోల్లు లక్ష్మీనారాయణ, లావుడియా వీరన్న, సైదులు పాల్గొన్నారు.

గ్రూప్-4 ఉద్యోగానికి ఎంపిక



బుద్దా విజయ్‌కిరణ్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని శాంతినగర్‌కు చెందిన బుద్దా విజయ్‌కిరణ్ గ్రూప్-4 ఉద్యోగానికి ఎంపికయ్యారు. 2021 తెలంగాణ గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా (టీజీఎస్‌సీసీ) ఎంపికయ్యారు. ఇప్పటికే కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూనే గ్రూప్-4 ఉద్యోగానికి సన్నద్ధమై పరీక్ష రాసి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. విజయ్‌కిరణ్ తల్లిదండ్రులు బుద్దా జయపాల్, జానకీ రిటైర్డు టీచర్లుగా ఉన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థులు..

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాల్లో ఎస్సీ స్టడీ సర్కిల్ అభ్యర్థులు తొమ్మిది మంది ఉద్యోగాలు సాధించినట్లు డిప్యూటీ డైరెక్టర్, సెక్రటరీ ఆఫ్ స్టడీ సర్కిల్ కె.సత్యనారాయణ, డైరెక్టర్ సీహెచ్.వీరభద్రం తెలిపారు. గత నెలలో ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో 12 మంది ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని వివరించారు. గ్రూప్-4 ఉద్యోగాలు సాధించిన వారిలో తోర్లపాటి రామకృష్ణ, పళ్ల సాయికిరణ్, కంచపోగు శ్రీకాంత్, బలవంతపు రాజా, జక్కుల వేణు, కంచపోగు బాలకృష్ణ, మాలోత్ నరసింహారావు, కాసిమళ్ల శ్రీశైలం, చలువాది శ్రావణి ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే ఉచిత కోచింగ్‌ను అభ్యర్థులు వినియోగించుకోవాలని సూచించారు.

ప్రభుత్వం - ప్రజలకు వారధిగా పత్రికలు



వైద్యాధికారికి కేక్ తినిపిస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పత్రికలు నిలుస్తున్నాయని సీహెచ్‌సీ వైద్యాధికారి కె.రాజేష్ అన్నారు. శనివారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని జర్నలిస్టు అత్తులూరి హనుమంతరావు ఆధ్వర్యాన కేక్ చేశారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ.. ప్రజలను చైతన్యపరచడంతో మీడియా పాత్ర కీలకమని పేర్కొంటూ జర్నలిస్టుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పోలంపల్లి నాగేశ్వరరావు, అత్తులూరి హనుమంతరావు, పెంటమళ్ల కోటయ్య, ఎస్.నరసింహారావు, తుమ్మా ఉపేందర్, డేగల వెంకటేశ్వర్లు, మల్లేల ఉపేందర్, వడ్లమూడి వెంకటేశ్వర్లు, గొలుసు ఆంజనేయులు, తాతా హనుమంతరావు, దండా శ్రీనివాసరావు, మల్లెబోయిన ఉపేందర్, తేజావత్ గిరి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు జీవనభృతి చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: వ్యవసాయ కూలీలకు రూ.12 వేల జీవనభృతి చెల్లించాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కూలీలకు హామీ ఇచ్చి 11 నెలలు అవుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం మోదీ పాలనలో వ్యవసాయ కూలీలకు చేసిందేమిలేదన్నారు. సమస్యలపై ఈ నెల 20 నుంచి డిసెంబర్ 2 వరకు విస్తృతంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షులు గోకినపల్లి వెంకటేశ్వరావు, వెంకయ్య, అర్జున్‌రావు, హనుమంతరావు, లాజర్, రాము, భాస్కర్,రాజు, సాయన్న, కిషన్, గంగాధర్, రాజేశ్వర్, వీరన్న, నాగన్న తదితరులు పాల్గొన్నారు.